సాక్షి విశాఖపట్నం

సోమవారం । 20 । మార్చి । 2023



అంధుల వాక్‌థాన్

రానున్న ఏడాదిలో ప్రవేశాలపై అవగాహన కల్పించేందుకు అంధుల పాఠశాల విద్యార్థులు ఆర్కే బీచ్‌లో వాక్‌థాన్ నిర్వహించారు.



మహిళలను గౌరవించండి

మహిళలను గౌరవించడం అందరి బాధ్యతని పార్వతీపురం మన్యం జిల్లా దిశ డీఎస్పీ హర్షిత అన్నారు. 8లో



పిచ్చుకలను కాపాడుదాం

సోమవారం ఇంటర్నేషనల్ స్పారో డే సందర్భంగా పిచ్చుకలను కాపాడుకోవాలని గ్రీన్ క్లైమేట్ సంస్థ పిలుపునిచ్చింది. 8లో

న్యూస్‌రీల్

22న సింహగిరిపై అప్పన్న పెళ్లిరాట



సింహాచలం : ఉగాదిని పురస్కరించుకుని ఈనెల 22న సింహగిరిపై శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామివారి పెళ్లిరాట ఉత్సవాన్ని విశేషంగా నిర్వహిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆదివారం తెలిపారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని ఆరోజు సాయంత్రం ఆలయ ఆస్థాన మండపంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తామన్నారు. అనంతరం స్వామివారి పెళ్లిరాట ఉత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. తదుపరి పండితులకు సత్కారాలు, దాతలకు విశిష్ట సేవ పురస్కారాలు ఉంటాయన్నారు. అనంతరం స్వామికి తిరువీధి నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4గంటలకు స్వామివారి మూలవిరాట్‌పై సూర్యకిరణాలు పడే అవకాశం ఉంటుందన్నారు. భక్తులంతా ఈకార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

ఉత్సాహంగా వైజాగ్ గాట్ టాలెంట్



డ్యాన్స్ చేస్తున్న చిన్నారి

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): జీ20 సదస్సు నేపథ్యంలో వేదిక పేరుతో జీవీఎంసీ నిర్వహిస్తున్న వైజాగ్ గాట్ టాలెంట్ కార్యక్రమంగా ఆదివారం ఆర్కేబీచ్‌లో ఉత్సాహంగా సాగింది. నగరంలోని విద్యార్థులు, పలువురు కళాకారులు తమలోని ప్రతిభను ఈ వేదికపై ప్రదర్శించారు. డ్యాన్సులు, పాటలు, స్కిట్లతో కూడిన 48 ప్రదర్శనలు ఇచ్చినట్టు నిర్వాహకుడు వినోద్ తెలిపారు.

నేడు జీవీఎంసీ స్పందన

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): జీవీఎంసీలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ పి.రాజాబాబు కోరారు.

రైల్వే కాలనీలో డీఆర్ఎం పర్యటన



కాలనీవాసులతో మాట్లాడుతున్న డీఆర్ఎం

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర) : రైల్వేకాలనీల్లో వసతులు, సౌకర్యాలను డీఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి పరిశీలించారు. పాత జైల్ ప్రాంతంలోని డాల్ఫిన్ నోస్ కాలనీ, హార్బర్ కాలనీ, దొండపర్తిలోని ప్రేమ్ భవన్‌లను ఆయన పరిశీలించారు. శానిటేషన్, సెక్యూరిటీ వంటి సదుపాయాలను పరిశీలించారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (కోఆర్డినేషన్) పీకే మహారాణా, సినియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (జనరల్) సీహెచ్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతికి యార్లగడ్డ రచనలు



ఉపరాష్ట్రపతికి పుస్తకాలను అందజేస్తున్న యార్లగడ్డ, చిత్రంలో వెంకయ్య నాయుడు

మహారాణిపేట: రాజ్యసభ మాజీ సభ్యుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తాను రచించిన పుస్తకాలను భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌కు బహూకరించారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సమక్షంలో ఆదివారం పార్లమెంటు భవనంలో వీటిని ఆయనకు అందజేశారు.

వన్డేమాతరం

- ఇండియా–ఆస్ట్రేలియా మ్యాచ్‌కు పోటెత్తిన యువత
- టీంఇండియా ఓడినా క్రీడా స్ఫూర్తి చాటుకున్న అభిమానులు



వుయ్ లవ్ క్రికెట్

వన్డేమాతరం అంటూ విశాఖ అభిమానులు క్రికెట్‌కు జై కొట్టారు. భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్ అభిమానుల్లో పూనకాలు రప్పించింది. కలిసొచ్చిన మైదానంలో భారత్ బ్యాటర్లు భారీ స్కోరు చేస్తారని ఎదురు చూసిన అభిమానులకు తీవ్ర నిరాశే ఎదురైంది. 117 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా జట్టు వికెట్ కోల్పోకుండా ఓపెనర్లు భారీ షాట్లతో అలరించారు. గెలుపోటములు పక్కన పెడితే విశాఖలో క్రికెట్ గెలిచింది. అభిమానులను ఉత్సాహపరిచింది. వేలాది మంది అభిమానుల మనసు గెలుచుకుంది. – విశాఖ స్పోర్ట్స్



విరాట్ బ్యాటింగ్



అభిమానుల సందడి



సూర్యకుమార్‌ను ఔట్ చేసిన ఆనందంలో ఆసీస్..

పాత్రల మధ్య ఘర్షణ, భావోద్వేగాలే 'దసరా'

చిత్ర హీరో నాని



మాట్లాడుతున్న హీరో నాని

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): పాత్రల మధ్య ఘర్షణ, భావోద్వేగాలే దసరా కథ అని ఆ చిత్ర హీరో నాని చెప్పారు. దసరా కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమన్నారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఆయన ఆదివారం సాయంత్రం నోవటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కీర్తి సురేష్ తనది హిట్ కాంబినేషన్ అన్నారు. నేను లోకల్ చిత్రంలో కీర్తి సురేష్‌తో కలిసి నటించానన్నారు. దసరా సినిమా ఈనెల 30 వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతోందని తెలిపారు. పుష్ప, కేజీఎఫ్–2 చిత్రం మాదిరిగానే దసరా చిత్రం గురించి ఈ నెల 30 నుంచి ప్రేక్షకులు మాట్లాడుకుంటారన్నారు. బలమైన కథ, కథనం మరో లెవెల్‌లో ఉంటుందని నాని చెప్పారు. ఇటువంటి పాత్ర ఏ నటుడికైనా చాలెంజ్‌గా ఉంటుందని, ఆ పాత్ర తనకు దక్కడం చాలా ఆనందంగా ఉందన్నారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సినిమా బాగా తీశాడన్నారు.

చిత్రం టీజర్, పాటలకు ట్రిమెండస్ రెస్పాన్స్ వచ్చిందని, చిత్రంపై అంచనాలు పెంచేసిందన్నారు. సాయికుమార్, సముద్రఖని, జరీనా వహాబ్, దీక్షిత్ శెట్టి, మాలీవుడ్ యాక్టర్ షైన్ టామ్ చాకో ఇతర కీలక పాత్రల్లో అద్భుత నటన కనబరిచారని నాని పేర్కొన్నారు. సంతోష్ నారాయణ మంచి సంగీతం అందించాడని, ఆర్ఆర్ ఇరగదీశాడన్నారు.

జోరు వాన

- విశాఖలో ఉదయం దంచికొట్టిన వర్షం
- మధ్యాహ్నం నుంచి తెరపినిచ్చిన వైనం
- నగరంలో 4 సెం.మీలు..



గాజువాకలో రోడ్డుపై వర్షపు నీరు

సాక్షి, విశాఖపట్నం : ఉమ్మడి విశాఖలో ఆదివారం జోరున వర్షం కురిసింది. అనకాపల్లి జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీగాను, విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరుగాను వర్షాలు కురిశాయి. వేకువజాము నుంచి ఉదయం పది గంటల వరకు ఆయా ప్రాంతాల్లో ప్రభావం చూపింది. ఉరుములు, మెరుపులతో పాటు పిడుగుల శబ్దాలు వినిపించాయి. అత్యధికంగా అనకాపల్లి జిల్లా గొలుగొండలో 8.8 సెం.మీలు, ఎఎస్సార్ జిల్లా ఎటపాకలో 6.2 సెం.మీలు, విశాఖ జిల్లా పెదగంట్యాడలో 4.3 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది. కాగా సోమవారం నుంచి జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టనున్నాయి. సోమవారం ఉమ్మడి విశాఖలో తేలికపాటి జల్లులు/వర్షం కురిసే అవకాశం ఉంది.

ఉమ్మడి విశాఖలో వర్షపాతం ఇలా.. (సెం.మీలలో)

జిల్లా	ప్రాంతం	వర్షపాతం
విశాఖపట్నం	పెదగంట్యాడ	4.3
అనకాపల్లి	అనకాపల్లి	4.1
విశాఖపట్నం	మల్కాపురం	4.0
విశాఖపట్నం	పెందుర్తి	3.8
విశాఖపట్నం	గాజువాక	3.8
విశాఖపట్నం	విశాఖ రూరల్	3.8
విశాఖపట్నం	భీమిలి	3.8
విశాఖపట్నం	సీతమ్మధార	3.6
విశాఖపట్నం	మధురవాడ	3.4

నేడు పంచగ్రామాల భూ సమస్య, చందనోత్సవంపై చర్చ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచగ్రామాల భూసమస్య పరిష్కారం, వచ్చేనెల 23న జరిగే స్వామివారి చందనోత్సవం (నిజరూప దర్శనం)కి సంబంధించి ఏర్పాట్లపైన అమరావతిలో సోమవారం సమావేశం జరగనుంది. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగే ఈసమావేశాలకు సంబంధించి ఇప్పటికే ఆశాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్ వేర్వేరుగా ఉత్తర్వులు జారీచేశారు. మధ్యాహ్నం 3గంటలకు పంచగ్రామాల భూసమస్య పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అడ్వైజరీ కమిటీ సమావేశం కానుంది. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చైర్మన్‌గా వ్యవహరించే కమిటీలో సభ్యులుగా ఉన్న ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి, అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ముఖ్యమంత్రి ముఖ్య అడ్వైజర్, రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, దేవదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, విశాఖ జిల్లా కలెక్టర్, సింహాచలం దేవస్థానం ఈవోలు చర్చించనున్నారు. అలాగే మధ్యాహ్నం 3.30గంటల నుంచి చందనోత్సవం ఏర్పాట్లపై దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల బృందం సమావేశం కానుంది. ఈమేరకు రాష్ట్ర దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్, సింహాచలం, విజయవాడ దేవస్థానాల ఈవోలు, విశాఖ జిల్లా కలెక్టర్, విశాఖ నగర పోలీస్ కమిషనర్ తదితరులు హాజరుకావాలని ఉత్తర్వులు జారీచేశారు.

బైబై బేబీ రిడ్లేస్



ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచి పెడుతున్న కార్పొరేటర్ కొండబాబు తదితరులు

కొమ్మాది: అంతరించిపోతున్న ఆలివ్ రిడ్లే తాబేళ్లను కాపాడేందుకు అటవీశాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు సఫలమవుతున్నాయి. వాటి గుడ్లను సేకరించి ప్రత్యేకంగా పొదిగించి పిల్లలను మరలా సముద్రంలోకి విడిచిపెట్టిన అద్భుత దృశ్యం ఆదివారం ఆవిష్కృతమయ్యింది. బుల్లిబుల్లి తాబేళ్లు బుడిబుడి అడుగులు వేసుకుంటూ సాగరంవైపు సాగిన దృశ్యాలు ప్రతి ఒక్కరికీ కనువిందు చేశాయి. జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ తీరంలో 120 ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను స్థానిక కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, అటవీశాఖ అధికారులు సముద్రంలోకి ఆదివారం విడిచిపెట్టారు. పర్యావరణ ప్రేమికులు ఈ దృశ్యాన్ని చూసి పరవశించిపోయారు. బైబై బేబీ రిడ్లేస్ అంటూ వీడ్కోలు పలికారు. జిల్లాలో సముద్ర తీర ప్రాంతాలు ఆలివ్ రిడ్లే సంతతి వృద్ధికి నిలయంగా నిలుస్తున్నాయి. వీటి సంరక్షణ కోసం ఆర్‌కే బీచ్, జోడుగుళ్లపాలెం, సాగర్‌నగర్, చేపలుప్పాడ, పెదనాగమయ్యపాలెం ప్రాంతాల్లో సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అటవీశాఖతోపాటు జిల్లాలో ఉన్న ప్రభుత్వ రంగ, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ఈ అరుదైన తాబేళ్ల గుడ్లను సంరక్షించి పిల్లలను సముద్రంలోకి విడిచిపెడుతున్నాయి.

ఉన్నత చదువులకు ఊపిరి

- జగనన్న విద్యా దీవెనతో విద్యార్థులకు భరోసా
- 2022–23 విద్యా సంవత్సరానికి విద్యా దీవెన పథకం మంజూరు
- విశాఖ జిల్లాలో 44,7172మంది విద్యార్థులకు లబ్ధి
- జిల్లాకు రూ. 34.40 కోట్లు విడుదల



విద్యార్థులకు చెక్ అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి



సీఎం ప్రసంగాన్ని వీక్షించేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన విద్యార్థినులు

విశాఖ విద్య: జగనన్న విద్యా దీవెన పథకం కింద విశాఖ జిల్లాలోని 44,712 మంది విద్యార్థులకు ఆదివారం రూ.32,40,31,447లు విడుదలయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో జరిగిన కార్యక్రమంలో బటన్ నొక్కి ప్రారంభించిన కొద్దిసేపటికే విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో విద్యా దీవెన డబ్బులు జమ అయ్యాయి. 2022–23 విద్యా సంవత్సరానికి అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించిన డబ్బులు మంజూరయ్యాయి. ఎస్సీ, బీసీ, ఎస్టీ, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన డిప్లమో, ఇంజినీరింగ్, డిగ్రీ ఆపై కోర్సులు చదివే 44,712 మంది పేద విద్యార్థులకు దీని ద్వారా లబ్ధి చేకూరింది. వీరిలో బీసీ వెల్ఫేర్ పరిధిలో 38,872 మంది, ఎస్సీ వెల్ఫేర్ పరిధిలో 4,452 మంది, మైనార్టీ వెల్ఫేర్ పరిధిలో 1,419 మంది విద్యార్థులు ఉన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యా దీవెన పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని తిలకించే ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు కలెక్టర్ మల్లికార్జున, విద్యా దీవెన పథకం జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డీవీ రమణమూర్తి లాంఛనంగా విద్యా దీవెన చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో యాత కార్పొరేషన్ చైరపర్సన్ పిల్లి సుజాత, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి శ్రీదేవి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి రహమాన్, సాంఘిక, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారులు, వసతి గృహ అధికారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక దన్ను

ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీలతో పాటు, ఆర్థికంగా వెనుకబడిన ఇతర వర్గాలకు చెందిన పేద విద్యార్థుల ఉన్నత చదువులకు జగనన్న విద్యా, వసతి దీవెన పథకాలు ఆర్థిక దన్నుగా నిలుస్తున్నాయి. కాలేజీలకు చెల్లించాల్సిన ఫీజు మొత్తాన్ని ప్రభుత్వం విడతల వారీగా చెల్లిస్తోంది. అంతే కాకుండా ఐటీఐ కోర్సు చేస్తున్న విద్యార్థులకు ఏడాదికి రూ. 10 వేలు, పాలిటెక్నిక్, ఇతర డిప్లమో కోర్సుల వారికి రూ.15 వేలు, డిగ్రీ ఆపై కోర్సుల చదివే విద్యార్థులకు రూ. 20 వేలు చొప్పున జగనన్న వసతి దీవెన పథకం అందిస్తూ చదువులకు సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

చదువులకు భరోసా



మాలాంటి వారి చదువులకు జగనన్న విద్యా దీవెన పథకం భరోసా నిలుస్తోంది. విద్యా, వసతి దీవెన డబ్బులు సకాలంలో అందుతుండటంతో చదువులు సవ్యంగా సాగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన రెడ్డికి రుణపడి ఉంటాం.

–కె. దుర్గా భవాని, బీకాం, డాక్టర్ వీఎస్ కృష్ణా కాలేజీ

బాగా చదువుకుంటాం



విద్యా, వసతి దీవెన పథకం ఎంతో ఉపయోగపడుతుంది. వసతి గృహంలో ఉంటూ డిగ్రీ ఫస్టియర్ చదువుతున్నాను. వసతి దీవెన డబ్బులు కూడా వస్తాయని చెప్పారు. విద్యా, వసతి దీవెన పథకాలతో బాగా చదువుకొని ఉన్నత చదువులను పూర్తి చేసుకుంటాం.

–కె.జ్యోతి, బీఎస్సీ, ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కాలేజీ

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం


మువ్వల శివ

అల్లిపురం: సెల్‌ఫోన్‌పై తీసుకున్న అప్పు తీర్చేందుకు డబ్బులు ఇవ్వలేదని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మహారాణిపేట పోలీసులు తెలిపిన వివరాలివీ.. రామజోగిపేటకు చెందిన మువ్వల శివ (24) డీమార్ట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, నాలుగేళ్ల బాబు ఉన్నాడు. శివ తాగుడుకు అలవాటు పడి భార్యను మానసికంగా హింసిస్తున్నాడు. దీంతో ఆమె నాలుగు నెలల కిందట బిడ్డతో కలసి కన్నవారింటికి వెళ్లిపోయింది. కాగా..శివ తన సెల్‌ఫోన్‌ను రూ. 17వేలకు తాకట్టు పెట్టాడు. ఆ అప్పు తీర్చేందుకు తల్లిదండ్రులకు డబ్బులు అడిగాడు. వారు ఇవ్వమని చెప్పడంతో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన ఇంట్లోని పిల్లాడు అతని తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీకొట్టి ఆటో డ్రైవర్ మృతి


మృతి చెందిన ఆటో డ్రైవర్ ఎర్రయ్య

సీతమ్మధార: పార్కింగ్ చేసిన కారును ఓ ఆటో ఢీకొట్టిన ఘటనలో ఆటోడ్రైవర్ మృతి చెందాడు. ద్వారకా జోన్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. సీతమ్మధార బిలాల్ కాలనీకి చెందిన ఎర్రయ్య (50) ఆటోడ్రైవర్. ఆదివారం 3 మధ్యాహ్నం గంటల సమయంలో సత్యం జంక్షన్ నుంచి బిలాల్ కాలనీలోని తన నివాసానికి వెళ్తున్నాడు. అప్పటికే ఎర్రయ్య పూటుగా మద్యం తాగి ఉన్నాడు. ఈ క్రమంలో సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ సమీపంలో పార్కింగ్ చేసి ఉన్న కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఎర్రయ్య రోడ్డుపై పడటం.. అతనిపై ఆటో పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎర్రయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న ద్వారకా ఎస్ఐ ధర్మేంద్ర సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

ఉప్పొంగిన ఉత్సాహం


బస్సులో వస్తున్న భారత క్రికెటర్లు


స్టేడియం లోపలకు ప్రవేశిస్తున్న ప్రేక్షకులు


ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్లు, విశాఖపట్నం


మ్యాచ్‌ను తిలకిస్తున్న మంత్రి అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం/విశాఖ స్పోర్ట్స్: క్రికెట్ మ్యాచ్ అంటే ఎప్పుడో ఓ సారి వచ్చే పండగ. అలాంటి పండగ వచ్చిందంటే ఎలాంటి అవాంతరాలు రాకుండా మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించాలని ఆకాంక్షిస్తారు. సాధారణంగా ఈ మ్యాచ్‌లకు వరుణుడే ఆటంకాలు కల్పిస్తుంటాడు. అందుకే మ్యాచ్ జరిగే రోజు ఆయన కరుణించాలని కోరుకుంటారు. కానీ భారత్–ఆస్ట్రేలియా క్రికెట్ మ్యాచ్‌కు రెండురోజుల ముందు నుంచే వరుణుడు భయపెట్టాడు. శనివారం ఉదయం నుంచే చిరుజల్లులతో బెదిరించాడు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉరుములు, మెరుపులు, కుండపోత వర్షంతో మరింత వణికించాడు. దీంతో అంతా క్రికెట్ మ్యాచ్‌పై ఆశలు వదులుకున్నారు. ఈ మ్యాచ్ ఇక వర్షార్పణమే అనుకున్నారు. వర్షం తగ్గుముఖం పట్టి క్రికెట్ మ్యాచ్‌కు ఆటంకం లేకుండా చూడాలని కోరుకున్నారు. వారి విన్నపాన్ని వరుణుడు కరుణించాడు. మధ్యాహ్నం 11 గంటలకు సూర్యుడు ఎండతో ప్రత్యక్షమయ్యాడు. ఫలితంగా ఒక్కసారిగా క్రికెట్ ప్రియుల ముఖాలు విప్పారాయి. ఇక ఆ తర్వాత వర్షపు ఛాయలే కానరాలేదు. మేఘాలు కమ్ముకున్నా వర్షించలేదు. దీంతో పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో జరిగే మ్యాచ్‌ను వీక్షించడానికి క్రికెట్ అభిమానులు తరలివచ్చారు. మ్యాచ్‌లో భారత్ ఓటమి చెందినా.. అభిమానులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి ఆటను ఆస్వాదించారు.


అభిమాని కేరింతలు


స్టేడియం బయట అభిమానుల సందడి

భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన రెండో వన్డేకు విశాఖతో పాటు శ్రీకాకుళం, ఒడిశా, జార్ఖండ్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు తరలివచ్చారు. ఆదివారం మధ్యాహ్నం నుంచే స్టేడియం కిక్కిరిసిపోయింది. ఇండియా గెలవాలంటూ అభిమానులు చేతిలో భారత్ జెండాలు పట్టుకుని.. ముఖాన మువ్వెన్నెల జెండా రంగులు అద్దుకొని నినదించారు. భారత్ టీ షర్టులు ధరించి స్టేడియం వద్దకు వచ్చి కేరింతలు కొట్టారు. అయితే అచ్చొచ్చిన స్టేడియంలో భారత్ బోల్తా కొట్టడంతో అభిమానులు ఒకింత నిరుత్సాహానికి గురయ్యారు. అడపాదడపా ఆభిమానులు కేరింతలు మినహా స్టేడియంలో ఎక్కువగా నిశ్శబ్దమే ఆవహించింది. ఇక మ్యాచ్ మొదలై.. పూర్తయినప్పటికీ స్టేడియం చుట్టూ భారీ సంఖ్యలో జనం గుమిగూడి కనిపించారు. ఇటు హనుమంతవాక నుంచి అటు మారికవలస వరకు రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా రెండు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ సిబ్బందికి సూచనలిస్తూ.. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. అభిమానుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు లు నడిపింది. విశాఖ జిల్లా తరఫున ఆడుతున్న అండర్–14, 16 జట్ల ఆటగాళ్లను ఏసీఏ ఉపాధ్యక్షుడు రోహిత్‌రెడ్డి అభినందించారు. వీరంతా ఈ మ్యాచ్‌కు బాల్‌బాయిస్‌గా సేవలందించారు.


స్టేడియానికి తరలివస్తున్న యువతులు, విదేశీయులు


సందడి చేస్తున్న ధోని వీరాభిమాని


భద్రత ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న సీపీ శ్రీకాంత్


మోముపై త్రివర్ణం


జెర్సీలు, జాతీయ జెండాలు విక్రయిస్తున్న వ్యాపారి

సందడి చేసిన హీరో నాని



విశాఖ స్పోర్ట్స్: భారత్–ఆసీస్ వన్డే మ్యాచ్‌లో భాగంగా స్టేడియంలో సినీ హీరో నాని సందడి చేశారు. తన సినిమా దసరా ప్రమోషన్‌లో భాగంగా కామెంటేటర్లు సునీల్ గావస్కర్, ఎంఎస్‌కే ప్రసాద్‌తో కాసేపు ముచ్చటించారు. సచిన్ ఆట అంటే తనకు ఇష్టమన్నారు. తను నటించిన పలు సినిమాల పేర్లను క్రికెటర్లకు ఇస్తూ స్టేడియం నార్త్‌బ్లాక్‌లో సందడి చేశారు. రోహిత్ జెంటిల్‌మెన్, హార్దిక్ పాండ్య పిల్ల జమిందార్, కోహ్లి గ్యాంగ్‌లీడర్ అంటూ టైటిల్ ఇచ్చారు. ఆసీస్ క్రికెటర్ ఆరోన్ ఫించ్‌కు దసరాలోని ధూమ్‌ధామ్ సిగ్నేచర్ స్టెప్ నేర్పించి.. ఇద్దరూ కలిసి సరదాగా ఆ స్టెప్ వేశారు.


చేతిపై విరాట్ పచ్చబొట్టు.. యువతి ఉత్సాహం



ఏసీఏకు బీసీసీఐ ప్రశంసలు

దొండపర్తి: భారత్–ఆస్ట్రేలియా వన్డే మ్యాచ్‌కు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేసి విజయవంతంగా నిర్వహించిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) కృషిని భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు ప్రశంసించింది. మ్యాచ్ నిర్వహణతో పాటు స్టేడియంను ఆధునీకరించిన తీరు, వసతుల కల్పనలో చూపిన చొరవపై ప్రశంసల జల్లు కురిపించింది. ముఖ్యంగా క్రీడాకారుల డ్రెస్సింగ్ రూమ్‌ను మలిచిన తీరును ప్రస్తుతించింది. డాక్టర్ వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి ఏసీఏ–వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ఆదివారం భారత్–ఆస్ట్రేలియాల మధ్య రెండో వన్డే మ్యాచ్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా క్రీడాకారులు, ప్రముఖులకే కాకుండా క్రికెట్ అభిమానులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇతర సభ్యులు విస్తృత ఏర్పాట్లు చేశారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం 11 గంటల వరకు ఎడతెరిపిలేకుండా వర్షం కురిసినప్పటికీ.. కేవలం గంటన్నరలోనే స్టేడియంను సిద్ధం చేశారు. మ్యాచ్ జరుగుతుందా? లేదా? అన్న సందేహాలు నెలకొన్ని పరిస్థితుల్లోను తీసుకున్న ముందస్తు చర్యలతో నిర్ణీత సమయానికే మ్యాచ్ ప్రారంభమైంది. ఈ స్టేడియం భవిష్యత్‌లో నిర్మించబోయే స్టేడియాలకు రోల్ మోడల్‌గా నిలుస్తుందని బీసీసీఐ ప్రతినిధి బృందం అభివర్ణించింది.

అవిశ్రాంతంగా పర్యవేక్షిస్తూ.. : ఈ వన్డే మ్యాచ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ తీవ్రంగా శ్రమించింది. ప్రధానంగా అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్ రెడ్డి కీలక పాత్ర వహించారు. మ్యాచ్ కోసం వచ్చిన క్రీడాకారులను, ఇతర క్రికెట్ దిగ్గజాలను ఆహ్వానం పలకడం దగ్గర నుంచి, అద్భుతమైన ఆతిథ్యాన్ని ఇవ్వడం వరకు చేసిన ఏర్పాట్లపై బీసీసీఐ గోపీనాథ్ రెడ్డిని ప్రశంసించింది. మరిన్ని మ్యాచ్‌లు విశాఖకు కేటాయిస్తామని హామీ ఇవ్వడం విశేషం. మరోవైపు మ్యాచ్‌ను తిలకించేందుకు వచ్చిన ప్రేక్షకులు కూడా ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా టికెట్లపైనే గేట్ నెంబర్, వెళ్లాల్సిన రూట్‌గా స్పష్టంగా ముద్రించారు. మ్యాచ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన జిల్లా అధికార యంత్రాంగానికి, ముఖ్యంగా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్, ఇతర శాఖల అధికారులకు గోపీనాథ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.


ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళుతున్న గోపీనాథ్‌రెడ్డి


తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో వైజాగ్ ఆర్టిస్ట్స్ క్రికెట్ టోర్నీ

అల్లిపురం: జ్ఞానాపురం జూబ్లీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్లే గ్రౌండ్ వేదికగా గత మార్చి 10, 11, 12 తేదీల్లో నిర్వహించిన వైజాగ్ ఆర్టిస్ట్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల అందజేత అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. సెంచూరియన్ విశ్వ విద్యాలయం వీసీ ఆచార్య డాక్టర్ జీఎస్ఎన్ రాజు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాడుతా తీయగా ఫేమ్ సింగర్స్ సార్థక్, అమిత, అన్విత్, గాయత్రిదేవి, హర్షిణి, ధీరజ్ తమ పాటలతో ప్రేక్షకులను అలరించారు. నృత్యభారతి డాన్స్ అకాడమీ చిన్నారులు సాంప్రదాయ నృత్యాలు, కుమారి సాత్విక్ కూచిపూడి నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం ఆచార్య జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ కళాకారులకు ఈ టోర్నమెంట్ ఎంతో ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్ని పెంచుతుందన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులు, సద్గీత్ క్రియేషన్స్ ఎం.డి. రాథోగణేష్‌కు, మరో నిర్వాహకుడు, చిత్ర దర్శకుడు శ్రీ విష్ణు స్కూల్ డైరెక్టర్ రెడ్డెం యాదవకుమార్‌కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ధ్రువీకరణ పత్రాలును తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, జిల్లా ఇన్‌చార్జి వేముల భాస్కరాచారి అందించి అభినందించారు. పైడా విద్యాసంస్థలు అధినేత పైడా కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కళాకారులు అందరితో నాలుగు సంవత్సరాలుగా క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో గాయకుడు రమేష్‌కుమార్ పట్నాయక్, జోషిత వ్యాఖ్యాతలుగా వ్యవహరించగా స్టీల్‌ప్లాంట్ జీఎం డాక్టర్ వి.చిట్టిబాబు, వరుణ్ ప్రసాద్, విశ్రాంత ఏడీసీపీ మొహ్మద్ ఖాన్, విశాఖ కళాకారుల సంఘం అధ్యక్షుడు క్యాలు జనార్దన్, మను పల్లా, విజయలక్ష్మీ, నాంచారయ్య, బాదంగీర్ సాయి, జగత్ రావు, ఏఎమ్.ప్రసాద్, ధనుంజయ్, కోరుకొండ రంగారావు, జి.వి.త్రినాథ్, ఫణిస్వామి పాల్గొన్నారు.

పిచ్చుకలను కాపాడుదాం

గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి రత్నం

సీతంపేట: నానాటికీ అంతరించిపోతున్న పిచ్చుకల సంతతి కాపాడటానికి ఈ ఏడాది 10 వేల పిచ్చుక గూళ్లు ఏర్పాటు చేయడం, లక్ష మందికి అవగాహన కల్పించడం తమ లక్ష్యమని గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం తెలిపారు. సోమవారం ఇంటర్నేషనల్ స్పారో డే సందర్భంగా ఆయన ఆదివారం 'సాక్షి'తో మాట్లాడారు. పిచ్చుకల సంతతి కాపాడటానికి 23 ఏళ్లుగా చేస్తున్న కృషి మంచి ఫలితాలనిస్తోందన్నారు. పిచ్చుకలను కాపాడటంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పిచ్చుకల కోసం ఇళ్లల్లో గూళ్లు ఏర్పాటు చేయడం, మట్టి పాత్రల్లో ప్రతి రోజూ నీరు, ఆహారం అందుబాటులో ఉంచాలని వారిలో చైతన్యం తెచ్చామన్నారు. ఈ ఏడాది 20వేల మంది విద్యార్థులకు అవగాహన కల్పించామని, 500 వరకు పిచ్చుకల గూళ్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పిచ్చుకల కోసం వరి కంకుల గుత్తులు కూడా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పంటలకు మేలు చేసే పిచ్చుకల సంతతి పరిరక్షణకు అందరం కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.


చెక్క,మట్టితో తయారు చేస్తున్న గూళ్లు

జర్నలిస్టులు.. సమాజ ప్రగతి సాధకులు

ఏయూక్యాంపస్: సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ విశాఖ శాఖలు సంయుక్తంగా ఆదివారం ఏయూలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అసెంబ్లీ హాలులో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది పంచాంగాన్ని వీసీ ఆవిష్కరించి మాట్లాడారు. ఏయూ అభివృద్ధిలో మీడియా సహకారం ఎంతో అవసరమన్నారు. అంతకుముందు పండితుడు కిరణ్ కృష్ణ పంచాంగ శ్రవణం నిర్వహించారు. పలువురు సీనియర్ జర్నలిస్టులను సన్మానించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, శాస్త్రీయ నృత్యాలు అందరినీ అలరించాయి. వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పోతుమహంతి నారాయణ్, అసోసియేషన్ అధ్యక్షుడు ఇరోతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పంచాంగం ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలపై హర్షం

మురళీనగర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు ఇవ్వడంపై వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 4,534 మంది క్వాలిఫైడ్ అభ్యర్థులు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు పొందుతారని చెప్పారు. ఈ నెలాఖరులోపు అభ్యర్థులందరికీ నియామకపు పత్రాలు వస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం 4,534 మంది కుటుంబాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తమ సంఘం తరఫున కృతజ్ఞతలు చెప్పారు.

మహిళలను గౌరవించడం అందరి బాధ్యత

బీచ్‌రోడ్డు: మహిళలను గౌరవించడం అందరి బాధ్యతని పార్వతీపురం మన్యం జిల్లా దిశ డీఎస్పీ హర్షిత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని లోటస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో రూపొందించిన ఫ్రీ మెంబర్‌షిప్ కార్డును ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో వైద్య పరీక్షలపై ఏడాది పాటు రాయితీతో సేవలందించడం హర్షణీయమన్నారు. ముఖ్యంగా గర్భిణులకు ఈ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మురళీ సంతోష్, గైనకాలజిస్ట్ డాక్టర్ వాణి, డాక్టర్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త అమావాస్య జాతరకు సర్వం సన్నద్ధం

అనకాపల్లిటౌన్ : కొత్త అమావాస్య జాతరను పురస్కరించుకుని నూకాంబిక అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో డి.చంద్రశేఖర్ తెలిపారు. గవరపాలెంలోని అమ్మవారి ఆలయ సమీపంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయం చుట్టూ రూ.11 కోట్లతో నిర్మించనున్న రాతి కట్టడం పనులు జూన్ 1న ప్రారంభించనున్నట్టు తెలిపారు. రూ.7 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేయగా, టీటీడీ నుంచి రూ.3 కోట్ల నిధులకు టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు నూకాంబిక అమ్మవారికి రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వీవీఐపీ భక్తుల దర్శనాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. అమ్మవారి ఆలయం ఎదురుగా తూర్పు దిక్కున 9 అంతస్తుల ఎత్తులో రాజగోపురం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 80, 81వ వార్డుల కార్పొరేటర్ల చొరవతో రూ.40 లక్షల నిధులు వెచ్చించి కొత్తగా మరుగుదొడ్లు నిర్మించనున్నట్టు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జీవీఎంసీ వారిచే రెండు మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేశామన్నారు.